## క్లుప్తంగా

### ఎంపీడీఓకు బదిలీ సన్మానం



ఎంపీడీఓ మంగమ్మను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

చుంచుపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు వెళ్తున్న చుంచుపల్లి ఎంపీడీఓ మంద మంగమ్మను సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఆత్మీయ బదిలీ వీడ్కోలులో ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మండల పరిషత్ అధ్యక్షురాలు బాదావత్ శాంతి, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయికి 'త్రివేణి' విద్యార్థిని ఎంపిక



రెహానను అభినందిస్తున్న మురళీకృష్ణ, సురేష్

కొత్తగూడెంరూరల్: సింగరేణి స్కూల్ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా జిల్లాలో నిర్వహించిన వకృత్వ పోటీలలో త్రివేణి స్కూల్‌లోని సరస్వతీ క్యాంపస్‌కు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్‌కే రెహాన తృతీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక అయింది. ఈ మేరకు త్రివేణి పాఠశాలల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి రెహానను సోమవారం అభినందించారు.

### 'పది' లోపే లక్ష్యాన్ని ఎంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఈ నాగరాజు

కొత్తగూడెం అర్బన్: జీవితంలో మంచి స్థానంలో స్థిరపడడం చాలా సులువు అని, పదో తరగతి లోపే లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని కేటీపీఎస్ డీఈ నాగరాజు అన్నారు. హ్యాపీ టూ హెల్ప్ యూ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో భవిష్యత్ ప్రణాళిక సదస్సు బాబుక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డీఈ నాగరాజు మాట్లాడుతూ.. పదో తరగతి తరువాత ఏ కోర్సులు తీసుకోవాలనే విషయాలపై స్పష్టత ఉండాలన్నారు. దీని కోసం ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరజ, ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి, చంద్రరావు, రాజేశ్వరి, విజయ, జ్యోతి, వెంకటేశ్వరరావు, ఫౌండేషన్ సభ్యులు వినయ్, లెంటిల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలకు మోక్షమెన్నడో?

- సుజాతనగర్‌లో ప్రతిపాదనలకే పరిమితమైన జూనియర్ కాలేజీ
- దూరప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థులు
- త్వరగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



కళాశాల ఏర్పాటుకు అనుగుణంగా ఉన్న ఉన్నత పాఠశాల ప్రాంగణం

సుజాతనగర్: ఉమ్మడి రాష్ట్రం నుంచి కొత్త రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటైన తరువాత పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొత్తగూడెం మండలంలో అంతర్భాగంగా ఉన్న సుజాతనగర్‌ను 20 గ్రామ పంచాయతీలతో కలిపి మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. మండలంలో కీలక శాఖలకు సంబంధించిన కార్యాలయాలను ఏర్పాటు చేశారు. కానీ మండలం ఏర్పడి సుమారు ఎనిమిదేళ్లు కావస్తున్నా ఇంతవరకు జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయలేదు. పేద విద్యార్థులు పెద్ద చదువులు చదువుకోవాలనే ఆశ ఉన్నా.. ఇంటర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో కలిపి ప్రతీ సంవత్సరం సుమారు 200 మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదవాలంటే కొత్తగూడెం, ఖమ్మం పట్టణానికి వెళ్లాల్సిందే. లేదంటే పదో తరగతి తర్వాత చదువు స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి. కొంతమంది పట్టణానికి వెళ్తున్న బాలికలను దూరప్రాంతాలకు పంపించడానికి తల్లిదండ్రులు సైతం ఇష్టపడడం లేదు. దీంతో దూరం, ఆర్థికభారంతో బాలికలు ఇంటికే పరిమితమవుతున్నారు.

**అనుకూలంగా జెడ్పీహెచ్‌ఎస్ ప్రాంగణం...**

కళాశాల స్థాపనకు ప్రస్తుత జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణం అనుకూలంగా ఉంది. విశాలమైన ఖాళీ స్థలం అందుబాటులో ఉంది. ఈ పాఠశాల ప్రాంగణంలో కళాశాల నిర్వహణకు కొన్ని అదనపు గదులు నిర్మించి మరికొన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తే కళాశాలను ఏర్పాటు చేయవచ్చు. ఇక్కడ కళాశాల ఏర్పాటు చేస్తే మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉండే అవకాశం ఉంది.

**పేదోళ్లకు అందని పైచదువులు...**

మండలంలోని అన్ని గ్రామాలు పూర్తిగా వ్యవసాయాధారితమే. సుజాతనగర్ గ్రామ పంచాయతీ మినహా మిగిలిన గ్రామ పంచాయతీలో ఎక్కువగా గిరిజనులే నివాసం ఉంటున్నారు. పేద విద్యార్థులపై చదువులు చదవాలంటే ప్రభుత్వ కళాశాలలే దిక్కు. సుజాతనగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే తమ కష్టాలు తీరుతాయని విద్యార్థులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**ప్రతిపాదనలకే పరిమితం..**

మండలంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని రెండేళ్ల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కళాశాల ఏర్పాటు దిశగా ప్రభుత్వం నుంచి ఎటువంటి గ్రీన్ సిగ్నల్ రాలేదు. దీంతో కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితం అయింది. ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటయ్యేలా చొరవ తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

**కాలేజీ ఏర్పాటు చేయాలి..**



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు పదోతరగతి తరువాత చదువు మానేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా కళాశాలను ఏర్పాటు చేయాలి.– **ఉడుగుల శ్రీకాంత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు, సుజాతనగర్**

**ఆర్థిక భారం పడుతోంది..**



సుజాతనగర్ మండల కేంద్రంగా ఉంది. ఇక్కడ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తే అనేక మందికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఇంటర్ కొరకు దూరప్రాంతాలకు పంపిస్తున్నారు. దీనివలన అదనపు ఆర్థిక భారం పడుతోంది.– **కత్తి బాలకృష్ణ, దళిత సంఘం నాయకుడు, సుజాతనగర్**

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం..**



కళాశాల ఏర్పాటుకు సంబంధించి మండలవాసుల కోరికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఈ మేరకు ఇక్కడ ఇంటర్ కాలేజీ అవసరమని తీర్మానం చేసి ప్రభుత్వానికి గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. – **బి.సులోచనారాణి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి**

# వన్యప్రాణులను సంరక్షించాలి



మాట్లాడుతున్న కట్టా దామోదర్‌రెడ్డి

పాల్వంచరూరల్: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉంది. వేసవికాలంలో అడవిలో నుంచి జనవాసాలకు, పంటచేను, కొలనుల వద్ద వన్యప్రాణులు సంచరిస్తుంటాయని, వాటిని వేటాడవద్దని పాల్వంచ ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి కోరారు. సోమవారం ఎఫ్‌డీఓ మాట్లాడుతూ.. వన్యప్రాణుల వేటపై నిఘాను తీవ్రతరం చేసినట్లు చెప్పారు. అంతేకాకుండా అటవీ ప్రాంతాల్లో గ్రామాల ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. జంతువుల వేట కోసం అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ ఉచ్చులకు జంతువులు బలి కావడమే కాకుండా మనుషులు కూడా ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని చెప్పారు. ఉచ్చులుపెట్టి జంతువులను వేటాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# విద్యారంగం పట్టని ప్రభుత్వం

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించక పోవడం బాధాకరం అని పీడీఎస్‌యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 7.75 శాతం బడ్జెట్ కేటాయించడం అంటే అక్షరాల రూ.21 వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను విద్యారంగంపై రేవంత్‌రెడ్డి సర్కార్ కూడా చేస్తోందని ఎద్దేవా చేశారు. గురుకులాలకు ఇచ్చిన నిధులు, విద్యపై వెచ్చించిన నిధులు చాలీచాలనంతగా కేటాయించి విద్యారంగ సమస్యలపై మాట్లాడకుండా.. ఉండడం సిగ్గుచేటని, ఇప్పటికీ సరైన వసతులు లేక సొంత భవనాలు లేక విద్యార్థులు, విద్యావ్యవస్థ సమస్యల నిలయంగా ఉందని, వాటిని పట్టించుకోకుండా బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా ఖూనీ చేస్తే ఆ విద్యా వ్యతిరేక విధానాలను రేవంత్‌రెడ్డి సర్కారు కొనసాగించడం దురదృష్టకరమని, కేసీఆర్ సరసన రేవంత్‌రెడ్డి చేరుతున్నాడని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి లేకుండా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం అందులో విద్యా వ్యవస్థకు తక్కువ నిధులకు కేటాయించడం దాని వెనుక ఉన్న అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేయకముందే ప్రభుత్వం మరోమారు బడ్జెట్‌ని సమీక్షించుకొని విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించి ప్రభుత్వం విద్యార్థుల పక్షాన తమ విధివిధానాలను తెలియజేయాలని కోరారు.

# గైర్హాజరైన కౌన్సిలర్లపై చర్య తీసుకోవాలి

ఇల్లెందు: మున్సిపాలిటీలో అవిశ్వాస పరీక్షకు గైర్హాజరైన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం ఆర్డీఓ శిరీషకు మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. సోమవారం అందిన సమాచారం ప్రకారం .. ఈ నెల 5న మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మీద అవిశ్వాసం కోసం ఆర్డీఓ శిరీష ఆధ్వర్యంలో జరగాల్సిన అవిశ్వాస పరీక్షకు ఐదుగురు కౌన్సిలర్లు గైర్హాజరు కాగా ఒక సభ్యుడిని అపహరించారు. ఇల్లెందు మున్సిపాలిటీలో 24 మంది సభ్యులు ఉండగా 19 మంది బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. సీపీఐ, ఎన్డీల నుంచి ఇద్దరు, బీఆర్‌ఎస్ రెబల్ నుంచి ముగ్గురు గెలుపొందారు. అయితే అవిశ్వాసానికి ఐదుగురు సభ్యులు గైర్హాజరయ్యారు. వీరిలో నలుగురు కాంగ్రెస్‌లో ఉండగా ఒకరు బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. ఈ ఐదుగురు సభ్యులకు విప్ జారీ చేశారు. ఈ ఐదుగురు గైర్హాజరవడాన్ని సవాల్ చేస్తూ... వారు గైర్హాజరు కావడం వల్లే కోరం లేక సమావేశం జరుగలేదని పేర్కొంటూ ఈ నెల 7వ తేదీన హరిప్రియ ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్నికల అధికారి, కొత్తగూడెం ఆర్డీఓ శిరీష విచారణ చేసి నిర్ణయం తీసుకోవాలిని కోరారు. ఇదిలా ఉండగా ఈ విషయంపై కోర్టును ఆశ్రయించారు.

# ఆలయ పాలక మండలి సమావేశం

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మగుడి) ఆలయ సముదాయంలో నిర్మించిన శివాలయం ప్రతిష్ఠపై పాలకమండలి సభ్యులు, గ్రామ ప్రజలతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సలహాలు, సూచనలు తీసుకుని ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**14న పెద్దమ్మగుడిలో సరస్వతీ పూజలు..**

బుధవారం పంచమి సందర్భంగా పెద్దమ్మగుడి సముదాయంలోని సరస్వతిదేవి ఆలయంలో ఉదయం 10.30 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేక పూజలు, సామూహిక సరస్వతీదేవి పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# 16న బంద్‌ను జయప్రదం చేయండి

టేకులపల్లి: ఈనెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మె, బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం లచ్చగూడెం, కిష్టారం, కోయగూడెం, గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. దీనివల్ల దేశంలో పేదరికం పెరిగిందన్నారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెడుతున్న మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ కూలీకి 200రోజుల పని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం అమలు చేసి పట్టాలు ఇవ్వాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం కోయగూడెం ఓసీ 2 నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు.

### విధుల్లో చేరిన సీఐ



ఇంద్రాసేనారెడ్డి

జూలూరుపాడు: జూలూరుపాడు(కొత్తగూడెం రూరల్) పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా అలేటి ఇంద్రాసేనారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జూలూరుపాడు సీఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ వీఆర్ కొత్తగూడెంకు బదిలీ అయ్యారు. ఇంద్రాసేనారెడ్డి టేకులపల్లి పోలీస్ సర్కిల్ నుంచి జూలూరుపాడుకు బదిలీపై వచ్చారు.

### కుర్చీలు వితరణ

జూలూరుపాడు: కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం దాతలు సౌమిత్రి శ్రీధరా చార్యులు, శ్రీవాణి దంపతులు వారి కుమారుడు శ్రీకమల్ జ్ఞాపకార్థం 50 కుర్చీలు వితరణ చేశారు. ఉపాధ్యాయుడు మిర్యాల రమేష్ సహకారంతో కుర్చీలను దాతలు హెచ్‌ఎం సంజీవరావుకు అందజేశారు.

### ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా రాధాకృష్ణ



ఇల్లెందు: ఇల్లెందు పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రముఖ విద్యావేత్త అర్వపల్లి రాధాకృష్ణ ఎన్నికయ్యారు. సోమవారం ఇల్లెందు ఐతా ఫంక్షన్ హాల్‌లో జరిగిన పట్టణ ఆర్యవైశ్య సంఘం సమావేశంలో పోటాపోటీగా పలువురు రంగంలోకి దిగినప్పటికీ అంతిమంగా అర్వపల్లి రాధాకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అర్వపల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ... తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో ఆర్యవైశ్యులను ఏకతాటి మీదకు తెచ్చి సంఘాన్ని బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. ప్రతీ సభ్యుడికి అందుబాటులో ఉంటూ అందరి మన్ననలు పొందేలా సంఘాన్ని తీర్చిదిద్దుతానని చెప్పారు.

# ఊరపిచ్చుకలకు ధాన్యం కంకులు

చుంచుపల్లి: కొత్తగూడెంకు చెందిన ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకుడు కొట్టూరు సుర్వి రాజశేఖర్ అంతరించిపోతున్న ఊర పిచ్చుకల జాతిని రక్షించేందుకు నడుం బిగించాడు. రైతు నేస్తాలుగా పేరొందిన ఊర పిచ్చుకలకు ఆహారంగా అందించాలనే లక్ష్యంతో సోమవారం ఇంటింటికీ వెళ్లి ధాన్యపు కంకులను అందుబాటులో ఉంచుతున్నాడు. వివిధ ప్రదేశాలలో కంకులను కట్టి అంతరించిపోతున్న ఊర పిచ్చుకల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వాటిని రక్షించాలని కోరుతున్నారు. ఏపీ రాష్ట్రంలోని తుని చెందిన ప్రముఖ ప్రకృతి ప్రేమికుడు పోలుపర్తి దాలి నాయుడు ఈ పక్షులకు ధాన్యపు కంకులను నులక దారంతో చెట్లతో పాటు ఇళ్ల వద్ద కట్టి పలువురు మన్ననలు పొందారు. ఆయన స్ఫూర్తితో కొత్తగూడెంలో మొక్కల రాజశేఖర్ ఈ ధాన్యపు కంకులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఊర పిచ్చుకల మనుగడ కోసం రాజశేఖర్ చేస్తున్న ప్రయత్నాలను పలువురు అభినందిస్తున్నారు.



విద్యానగర్‌లో ధాన్యపు కంకులను వేలాడదీస్తున్న రాజశేఖర్

# జాతరను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

టేకులపల్లి: టేకులపల్లి మండలం జండాలతండా (చింతల్లంక తండా) వద్ద కొలువుదీరిన శ్రీ పాలమడుగు సమ్మక్క, సారక్క మహాజాతర వేడుకలను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు పూనెం సురేందర్, గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.హత్తీరాం నాయక్, పూజారి బాణోతు తేజ్యా పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం గద్దెల సమీపంలో ప్రత్యేక పూజల అనంతరం జాతర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూజారి జాతర వివరాలు వెల్లడించారు. ఈనెల 21న సారలమ్మ, 22న సమ్మక్కలు గద్దెల మీదకు వస్తారని తెలిపారు. 23న మొక్కులు, ప్రత్యేక పూజలు, 24న అమ్మవార్లు గద్దెల నుంచి గుట్టకు పయనం అవుతారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఎంపీటీసీ భూక్యా శంకర్, మాజీ సర్పంచ్ అజ్మీర గలక, గంగరాజు, బానోతు జగ్యా, బానోతు కిషన్, బానోతు భోజ్యా, భూక్యా సక్రాం, బానోతు రాంబాబు పాల్గొన్నారు.

# కార్మికుల శ్రమ వృథా కావొద్దు



ఇల్లెందు: డ్రెయినేజీ పనులను పర్యవేక్షిస్తున్న చైర్మన్ డీవీ



జూలూరుపాడు: మాచినేనిపేట తండాలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇళ్ల నుంచి వచ్చే మురుగు, చెత్తచెదారం తొలగించేందుకు శానిటేషన్ వర్కర్లు చేతులు, కాళ్లు పెట్టి తొలగిస్తున్నారని, వారు ఎంతో శ్రమ చేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారని, అలాంటి వారి శ్రమను వృథా కానివ్వరాదని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఇల్లెందు పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీల క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టారు. మున్సిపాలిటీ తడి, పొడి చెత్త సేకరణ కోసం చెత్త వాహనాలను ప్రవేశపెట్టిందని, ఇంటింటికీ చెత్త బుట్టలు అందజేసిందని, ప్రతీఒక్కరు తమ ఇళ్లల్లోని చెత్తను వేరు చేసి చెత్త వాహనాలకు అందజేయాలని కోరారు. బుగ్గవాగులోకి చెత్తచెదారం, ప్లాస్టిక్ కవర్లు వెళ్లకుండా ఫిన్సింగ్ ఏర్పాటు చేశారు.

జూలూరుపాడు: పల్లెల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం (స్పెషల్ శానిటేషన్ డ్రైవ్) కొనసాగుతోంది. సోమవారం పంచాయతీ ప్రత్యేక అధికారులు, సెక్రటరీల ఆధ్వర్యంలో ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడం, డ్రెయినేజీల్లో పూడిక తీత పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల ఉపయోగంలో ఉండేలా చర్యలు, తాగునీటి సరఫరా పైపులైన్, వాటర్ ట్యాంకు గేట్ వాల్స్ మరమ్మత్తు చేశారు.

# ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్‌లతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు...

- అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కాకాని దుర్గ తన భర్త వెంకటేశ్వర్లు గత నవంబర్ 16న రైలు ప్రమాదంలో మరణించాడని, పుట్టుకతో అంగవైకల్యం ఉన్న తాను శారీరకంగా కూలీ పనులకు వెళ్లే స్థితిలో లేని దీన స్థితిలో ఉన్నానని కలెక్టరేట్‌లో ఏదైనా పని ఇప్పించాలని దరఖాస్తు చేయగా జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్‌కు ఎండార్స్ చేశారు.
- లక్ష్మీదేవిపల్లి మండలం ఇందిరానగర్ నివాసి అయిన కూరపాటి ఉపేంద్ర తన భర్త వెంకన్న ఇటీవల గుండెపోటుతో మరణించాడని కూలీ చేసుకుంటూ జీవిస్తున్నామని, 30 సంవత్సరాల మానసిక వికలాంగురాలైన కుమార్తె ఉందని ప్రభుత్వం వికలాంగురాలిగా గుర్తింపు కార్డు ఇచ్చినప్పటికీ పెన్షన్ రావడం లేదని ఇప్పించి ఆదుకోవాలని చేసిన దరఖాస్తును దివ్యాంగుల సంక్షేమాధికారికి ఎండార్స్ చేశారు. చంద్రుగొండకు చెందిన సీహెచ్ రాజు, వి.వెంకటేశ్వర్లు, పద్దిని వేణు తమ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాత ఆస్పత్రిని పంచాయితీ వాళ్లు కూల్చి వేసి వదలివేశారని, ఆ స్థలాన్ని స్థానికులు ఆక్రమించుకుని షాపులు నిర్మించుకున్నారని, ఈ స్థలంలో గ్రంథాలయం, పబ్లిక్ టాయ్‌లెట్స్ నిర్మించడానికి పంచాయితీ వారు సిద్ధంగా ఉన్నారని అనమతి ఇవ్వాలని దరఖాస్తు చేయగా చంద్రుగొండ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

**అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి**

చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ గ్రామ పంచాయితీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై, సహకరిస్తున్న పంచాయితీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకుడు యెర్రా కామేష్ సోమవారం ప్రజావాణిలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ... కీలక అధికారి పరోక్ష సహకారంతో ఈ అక్రమ నిర్మాణాల జరుగుతున్నాయని ఆరోపించారు. రాజకీయ నాయకులు, బడా వ్యాపారుల ఆర్థిక, రాజకీయ అండదండలతో ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా, పంచాయతీరాజ్ చట్టాలకు వ్యతిరేకంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నా జిల్లా పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు ఎన్ని బహుళ అంతస్తుల నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. నోటీసులు ఇచ్చి ఫొటోలు దిగి పేపర్లకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని తర్వాత యథావిధిగా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

# 'పీఎం విశ్వకర్మ'తో ఆర్థిక తోడ్పాటు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద కులవృత్తి, చేతివృత్తిదారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాన్ని లబ్ధిదారులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మొదట అదనపు కలెక్టర్ పి.రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సంప్రదాయక కులవృత్తులు, చేతివృత్తులను లాభదాయకంగా మార్చడం, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు ప్రధాని విశ్వకర్మ యోజన పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖాధికారి సీతారాం మాట్లాడుతూ... ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఏర్పాటు చేసిన ఈసెమినార్‌లో పథకంపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కుమ్మరి, కమ్మరి, మంగలి, వడ్రంగి, రజక, వడ్డెర, కంసాలి, దర్జీ వంటి చేతివృత్తులపై ఆధారపడి జీవించే వారంతా ఈ పథకానికి అర్హులన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్‌కార్డు ధృవీకరణ పత్రాలతో సీఎస్‌సీ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారులకు మొదటి విడత లక్ష రూపాయల రుణం మంజూరు ఉంటుందని తెలిపారు. నిర్ణీత వ్యవధిలో చెల్లించిన వారికి తిరిగి రూ.రెండు లక్షల రుణం మంజూరు అవుతుందని తెలిపారు. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ బాలానగర్ డీఎఫ్‌ఓ శివకుమార్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం యొక్క ప్రాముఖ్యత, పథకం ప్రయోజనాలను పొందేందుకు లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే విధానం గురించి చేతి వృత్తిదారులకు, కళాకారులకు అవగాహన కల్పించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సదస్సులో పాల్గొన్న వారి సందేహాలను సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నివృత్తి చేశారు. ఈ సదస్సుకు 300 మంది హాజరయ్యారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరామ ప్రసాద్ పథకం గురించి వివరించారు. స్కీమ్‌లో చేరడానికి దశలవారీ విధానాన్ని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర, లీడ్ బ్యాంకు మేనేజరు రామ్‌రెడ్డి, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆకుల నాగేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు



హాజరైన ప్రతినిధులు, అధికారులు